# ఇప్పుడు మీరు ప్రత్యేక జనరంజని వింటారు!



చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ మా కాలనీ రచయిత! అతనికి హఠాత్తుగా ప్రత్యేక జనరంజని సమర్పించే అవకాశం ఇచ్చారు రేడియోవాళ్ళు.

ఆ రోజు అతనిని అందరూ తెగ అభినందించేస్తున్నారు.

"ఒరేయ్! అందరిలాగా కాకుండా మంచి రికార్డ్స్ వేయరా! పాత సినిమాల్లో చాలా మంచి పాటలున్నాయిగా! అవన్నీ వేయ్" అన్నాడు గోపాల్రావ్.

"చూస్తావ్ కదురా! బెస్ట్ రికార్డ్స్ సెలెక్ట్ చేసి వేస్తాను" అన్నాడతను గర్వంగా.

"అందమే ఆనందం ఆనందమె జీవిత మకరందం" పాట మర్చిపోకొరేయ్– హెచ్చరించాడు వెంకట్రావ్.

"ఆ పాట ఎలా మర్చిపోతాను బాబాయ్."

సాయంత్రం వరకూ ఆఫీసులో స్టాఫంతా చంద్రకాంత్ వివిధ భారతి ద్వారా సమర్పించే ప్రత్యేక జనరంజని కార్యక్రమం గురించే ముచ్చటచ్చుకుంటూ గడిపారు. అతను కథలూ కాకరకాయలు రాస్తుంటాడని ఆఫీసులో అందరికీ తెలుసు. అతను వ్రాసిన ఓ కథ "కాకరపాలెం కుర్రోడు" అనే సినిమాగా కూడా తీశారు. రేడియో స్టేషన్ వాళ్ళకు చంద్రకాంత్ రచయిత అని తెలీదు. అసలు వాళ్ళ దృష్టిలో రచయితలు వేరు. వాళ్ళెవరూ

పత్రికల్లో కథలు రాయరు. రచయిత అంటే మేగజైన్‌లో రచనలు చేయాలని ఎక్కడైనా రూలుందా అని వాళ్ళ ప్రశ్న- కేవలం రేడియోకి వ్రాసేవాళ్ళే రచయితలు, కేవలం రేడియోలో నటించేవారే నటులు అని వాళ్ళనుకుంటుంటారు. ఎప్పుడయినా అడపాదడపా ఇదిగో ఇలా చంద్రకాంత్ లాగా సినిమాకి కథ వ్రాసిన రచయితలను కూడా రచయితలుగా గుర్తిస్తుంటారు.

చంద్రకాంత్ వారం రోజుల పాటు తన జనరంజని శ్రోతలతో ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలీ అన్నది నానా హైరానాపడి నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత తను మాట్లాడే మాటలకు పొంతన కుదిరేలా మాంచి పాటలు ఎన్నుకొని లిస్ట్ తయారుచేసుకున్నాడు.

రికార్డింగ్ రోజున ఓ గంట ముందే బయలుదేరి ప్రతిభాదేవి ఇంటికి చేరుకున్నాడు.

ప్రతిభాదేవి అతని కథలు చదివి, అతనిని తెగ ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న అమ్మాయి, (ఆ పిల్ల, తెలుగు మీడియం స్టూడెంట్ అని గమనించ ప్రార్థన)

"ఏమిటి? వారం రోజుల్నుంచి కన్పించటం వేదు. ఊరెళ్ళారా?" అడిగిందావిడ ఆశ్చర్యంగా.

"నేను ప్రత్యేక జనరంజని ప్రోగ్రాం ఇస్తున్నానండీ! అందుకని పాటలు వగైరా రెడీ చేసుకోవడంలో కొంచెం బిజీగా ఉన్నాను..."

"వాట్? మీరు ప్రత్యేక జనరంజని ఇస్తున్నారా?"

"అవును-" గర్వంగా అన్నాడు చంద్రకాంత్.

"మీరా?"

"అవును-"

"ఓ గాడ్! ఎప్పుడు?"

"ఇవాళే"

"వాహ్- అయితే మరి నాకిష్టమయిన పాటలు వేస్తారా?"

"ఓ! అన్నీ మీరు లైక్ చేసేవే"

"అబ్బ! మరి నాకు ముందే చెప్పలేదేం?"

"మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేద్దామని-"

"చిగురాకులలో చిలకమ్మా- తప్పక వేస్తారు కదూ?"

"ఎలాంటి అనుమానం లేకుండా"

"థాంక్‌యూ ప్రియా-"

"ఓ! ఆ రికార్డు కూడా వేస్తున్నానండీ."

ఆమె అతని భుజం మీద కొట్టింది నవ్వుతూ.

"అది నేను మీకు చెప్తున్నానండీ 'థాంక్ యూ ప్రియా' అన్నరికార్డేమీలేదు..."

చంద్రకాంత్ తన తప్పుకి నాలిక్కరుచుకోబోయి, కరుచుకోలేదు.

"సారీ! అది లేటెస్ట్ పాటేమో అనుకున్నాను, చూడండి మీ కిష్టమయిన పాటలన్నీ వేస్తాను. ఎందుకంటే అవి మనిద్దరికీ ఇష్టమైనవేకదా..."

ఆమెకు టాటా చెప్పి రేడియోస్టేషన్ చేరుకున్నాడతను.

వివిధ భారతి ఆఫీసులో ఒకావిడ కూర్చుని టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్లో పాటలు వింటోంది.

"చూడండి! నన్నివాళ రికార్డింగ్‌కి రమ్మని చెప్పారు..."

ఆమె విసుగ్గా అతనివంక చూసింది. ట్రాన్సిస్టర్‌లో "సోగ్గాడే చిన్నినాయన- ఒక్క పిట్టనైన కొట్టలేడు సోగ్గాడే" అన్న పాట గట్టిగా వినబడుతోంది.

"ఏమంటున్నారు?"

"ఇవాళ నా రికార్డింగ్ ఉంది." "సోగ్గాడే చిన్నినాయన ఒక్క పిట్టనైన కొట్టలేడు సోగ్గాడే-"

"ఏమంటున్నారు?" మళ్ళీ అడిగిందామె.

"ఆ ట్రాన్సిస్టర్ సౌండ్ కొంచెం తగ్గిస్తే..." "సోగ్గాడే చిన్నినాయన" ఆమె సౌండ్ తగ్గించింది.

"ఇవాళ నా రికార్డింగ్ ఉందండీ!"

"రికార్డింగా?"

"అవునండీ!"

"యువవాణి" ప్రోగ్రామా?" అనుమానంగా అడిగింది.

"కాదండీ! జనరంజని."

"జనరంజనా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవునండీ! నా పేరు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్-"

"కావచ్చు గాని జనరంజని అంటారేమిటి?"

"నేను జనరంజని ప్రోగ్రాం ఇస్తున్నానండీ ఈసారి! స్పెషల్ జనరంజని"

"మీరిస్తున్నారా?"

"అవునండీ"

"ఎవరిమ్మన్నారు మిమ్మల్ని?"

"మీరేనండీ..."

"నేనా?"

"మీరంటే మీరు కాదండీ! మీ వివిధభారతి వాళ్ళన్న మాటండీ."

"మిమ్మల్ని ఇమ్మన్నారా?"

"అవునండీ, నేను రచయితను."

"మీరు రచయితా?" ఇంకా ఆశ్చర్యపోతూ అందామె,

"అవునండీ! కాకరపాలెం కుర్రోడు- సినిమా నా కథే!"

"నిజంగా?"

"నిజమండీ! కావాలంటే ఎవర్నయినా అడగండి!"

"అయితే అలా కూర్చోండి. మీ రికార్డింగ్ వున్నట్లు నాకెవ్వరూ చెప్పలేదు. ఇప్పుడే కనుక్కుంటాను" అంటూ ఎక్కడికో ఫోన్ చేసింది.

"ఎంగేజ్డ్" అంది అతనివంక చూసి చిరాగ్గా.

"అవునండి. ఈ ఫోన్లెప్పుడూ ఎంగేజ్ వుంటాయ్" మర్యాద కోసం అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

మళ్ళీ డయల్ చేసి రెండు చేతుల్తో తల పట్టుకని "ప్చ్" అంది. మధ్యలో ట్రాన్సిస్టర్ సౌండ్ కొంచెం పెంచింది. పాట ఠక్కున అందుకుంది.

"ఆడ నీవూ ఈడ నేనూ సూసుకుంటూ కూరుసుంటే ఎన్నాళ్ళు తాలగలను చందమామ,ఎన్నాళ్ళు దాచగలను చందమామా"

సౌండ్ మళ్ళీ తగ్గించేసిందామె-

మరోసారి డయల్ చేసింది. "హు" అందీసారి రిసీవర్ పగిలేలా ఫోన్‌కేసి కొడుతూ.

"ఒక్క నిమిషం, ఇప్పుడే వస్తాను-" అని లేచి బయటికెళ్ళి పదినిషాల తర్వాత తిరిగి వచ్చింది.

"మీరు మాట్లాడదలుచుకున్న మేటర్ తెచ్చారా?" అడిగిందామె.

"ఓ ఇదిగో!" కాగితాలు ఆమె కిచ్చాడు. కుర్చీలో కూర్చుని అంతా చదివేసింది.

"ఇక్కడ, "క" కింద "క" వత్తు ఇవ్వడం మర్చిపోయారు" అంది ఓ చోట అతనికి చూపుతూ.

"థాంక్సండీ! మీరు 'క' కింద 'క' వత్తు చూపకపోతే చాలా గొడవయిపోయేది. "క" కింద "క" వత్తు ఎంత ఇంపార్టెంటండీ? నేను మామూలుగా వత్తులేకుండా చదివేసేవాడిని. దాంతో అర్థం మారిపోయేది. ఆ తరువాత దానికింద ఏ వత్తు వచ్చినా లాభం ఉండదు కదా! 'క' కింద 'క' వత్తు ఉంటేనే గాని...."

ఆ తరువాత ఏమనాలో తెలీక ఆగిపోయాడు చంద్రకాంత్.

ఆమె చాలా సంతోషించినట్లు మొఖంలో తెలిసిపోతోంది.

"క్రిందటిసారి కూడా ప్రత్యేక జనరంజని స్క్రిప్టులో ఇలాగే 'ర' కింద 'ర' వత్తు ఇవ్వడం మర్చిపోయారండీ ఒకాయన.. పేరుకు పెద్ద రచయిత అయినా 'ర' కింద 'ర' వత్తు ఇవ్వలేదు."

"అబ్బ 'ర' కింద 'ర' వత్తే? ఎంత డేంజరస్? మీరు జీనియస్ కాబట్టి

కనుక్కోగలిగారు."

ఆమె లేచి నిలబడింది మళ్ళీ.

"స్టూడియో ఖాళీగా ఉందేమో చూసి వస్తాను." అంటూ లోపలికెళ్ళి పావుగంట తర్వాత తిరిగి వచ్చింది.

"అన్నీ ఫుల్‌గా ఉన్నాయండీ! అసలు మీకివాళ రికార్డింగు ఉందని ముందే తెలుస్తే స్టూడియో బుక్ చేయటం జరిగేది– కానీ నాకు ఇన్‌ఫర్‌మేషన్ లేదు."

"మరిప్పుడేం చేద్దామంటారండీ?

"ఒక రికార్డింగు మాత్రం ఓ అరగంటలో పూర్తవుతుందండీ! ఆ తర్వాత చేస్తాను పోనీ–"!

"సరే!"

"మీరు సెలక్ట్ చేసిన పాటలలిస్టు ఉందా?"

లిస్టు తీసి ఆమె ముందుంచాడతను.

ఆమె లిస్టువంక చూస్తూనే రక్కున తలెత్తి చంద్రకాంత్ వంకచూసింది.

"మొదటిపాట" 'అందమె ఆనందం' వేస్తున్నారా?" ఆనందంగా అడిగింది.

"అవునండీ. ఆ పాటంటే నాకెంతో ఇష్టం!"

"నాకూ ఎంతో ఇష్టమండీ చాలా మంచిపాట అది."

"అలాగా, ఆ పాట లిరిక్ కూడా చాలా బావుంటుందండీ."

"కానీ ఆ రికార్డ్ మరీ పాతది కదండీ. మా దగ్గర ఉండదు."

"ఉండదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఉండదండీ, మరీ పాత రికార్డులు ఉండవు."

"అదేమిటి? ఇంతపెద్ద రేడియో స్టేషనులో అంత మంచి రికార్డులు ఉండవా?"

"ఉండవు?"

ఆమె మళ్ళీ లిస్టు చూసింది.

"ఇదిగో ఈ రెండో రికార్డ్ కూడా ఉండదు."

"అది శభాష్ రాముడులోందండీ, మరీ అంత పాతదేం కాదుగా?"

"అయినా కూడా కష్టమండీ, దొరకదు."

"అయ్యో ఎలాగండీ మరి?"

"ఎలాగోలా అడ్జస్ట్ అవ్వాలండి. చాలా పాత పాటలు మా దగ్గర ఉండవు. ఇదిగో 'చిగురాకులలో చిలకమ్మా' రాశారు చూశారా, ఇదీ ఉండదు."

"అదేంటండీ. ఇది చాలా ఫేమస్ సాంగ్ కదా! దొంగరాముడు లోది."

"అందరూ కోరే పాట కాబట్టే ఇది అసలుండదండీ. ఉన్నది పూర్తిగా అరిగిపోయి

ఉంటుంది.. మళ్ళీ కొత్తది కావాలంటే కష్టం!"

అప్పుడే ఒకాయన రెండు టేప్స్ తీసుకుని వచ్చాడక్కడికి.

"ఏమిటి అరిగిపోయింది?" అడిగాడు చిరునవ్వుతో.

"దొంగరాముడులోని పాటండీ. చిగురాకులలో చిలకమ్మా-"

"ఎవరన్నారు అది అరిగిపోయిందనీ?" అడిగాడతను.

"నేను అంటున్నాను- అసలది మన దగ్గరే లేదనుకుంటాను కదా!"

"అలా అనుకోకండి, ఉంది."

"ఉందా?"

"అవును! మొన్నే నేను జనరంజనిలో వేశాను. ఫస్ట్‌క్లాస్‌గా ఉంది రికార్డ్."

"అరగలేదా." అడిగిందామె.

"కొంచెం కూడా అరగలేదు." అనేసి అతను టేప్స్ అల్మారాలో ఉంచి వెళ్ళిపోయాడు.

"పోనీ ఓ పని చేస్తే బాగుంటుందండీ. మీ దగ్గరున్న పాటల లిస్ట్ నాకిస్తే అందులో వున్నవే సెలక్ట్ చేసుకుంటాను." అన్నాడు చంద్రకాంత్ నిరుత్సాహంగా.

"లిస్టా? లిస్టేమిటి?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"లిస్ట్ అంటే అదేనండీ రికార్డ్స్ లిస్ట్"

"అలాంటివేమీ ఉండవండీ ఇక్కడ " చిరాకుగా అందామె.

"మరి మాకెలా తెలుస్తుందండీ- ఫలానా పాట ఉందో లేదో"

"మీరు రాసిచ్చి వెళ్ళిపోండి. ఉంటే వేస్తాం లేకపోతే లేదు."

చంద్రకాంత్‌కి ఓ క్షణం మతిపోయినట్లయింది.

"స్టూడియో ఖాళీ అయిందేమో చూసొస్తానుండండి" అంటూ వెళ్ళి కాసేపటి తర్వాత తిరిగి వచ్చింది.

"రండి స్టూడియో ఖాళీ ఉంది..."

చంద్రకాంత్ లేచివెళ్ళి రూమ్‌లో మైకుముందు కూర్చున్నాడు.

"ఓసారి చదవండి సౌండ్ ఎడ్జస్ట్ చేస్తాను" అందామె రికార్డింగ్ రూమ్‌లోనుంచి.

రెండులైన్లు చదివాడు.

"ఆగండి! కొంచెం డిస్టర్బెన్స్ వస్తోంది-" అంది అతని గదిలో కొచ్చి.

"ఏం చేస్తారుమరి?"

"టెన్నీషయన్‌ని పిలుచుకొస్తాను."

వెళ్ళి పావుగంట తర్వాతోవ్యక్తితో పాటు తిరిగివచ్చిందామె.

అతను వచ్చి మైకును అటూ ఇటూ తిప్పి, దాని నెత్తిమీద రెండు సార్లు లాగి కొట్టాడు.

"ఏదీ ఇప్పుడు మాట్లాడండి చూద్దాం" అన్నాడు, అక్కడే నిలబడి. చంద్రకాంత్ మళ్ళీ రెండు లైన్లు చదివాడు.

ఈ సారి గొంతు అసలు రావడం లేదని రికార్డింగ్ రూమ్‌లోనుంచి ఆమె సైగ జేసింది.

అతను మళ్ళా మైక్‌ని ఓ తన్ను తన్నాడు.

"ఇప్పుడు మాట్లాడండి చూద్దాం."

చంద్రకాంత్ మళ్ళీ రెండు లైన్లు చదివాడు. ఆమె అద్దంలోనుంచి తల అడ్డంగా తిప్పింది.

అతను తివాచీ కిందున్న ఓ అర తెరచి అందులోని రెండు వైర్లు తారుమారు చేశాడు. తరువాత మైక్ నెత్తిమీద మళ్ళీ రెండు కొట్టి "ఇప్పుడు మాట్లాడండి' అన్నాడు.

చంద్రకాంత్ మళ్ళీ రెండులైన్లు చదివాడు.

ఆమె లాభం లేదన్నట్లుగా అద్దంలో నుంచి చేయి ఊపింది.

అతను వెళ్ళి మరో టెక్నీషయన్‌ని తీసుకొచ్చాడు. ఇద్దరూ కలసి అరగంట సేపు పరీక్షలు చేసి చంద్రకాంత్‌తో మొదటి రెండులైన్లు మరో పదకొండుసార్లు చదివించి చివరకు ఆ మైకు రికార్డింగ్‌కి అనర్హం అని తేల్చారు.

"ఇంకో యూనిట్ ప్రయత్నిద్దాం పదండి" అందామె. అందరూ కలిసి పక్కనే ఉన్న మరో గదిలో కెళ్ళారు.

మళ్ళీ కథంతా మామూలే. మళ్ళా రిపేర్లు, మైకు నెత్తిమీద కొట్టడాలు, వైర్లుమార్చడాలు, చంద్రకాంత్ ఇరవై ఆరుసార్లు చదవడాలు షెడ్యూలు ప్రకారం జరిగిపోయాయి.

ఆ తరువాత ఇంకో గదిలోకి మారారు.

"ఇలా ఎన్ని గదులున్నాయండీ!" బొంగురుపోయిన గొంతుతో కారిపోతున్న చెమటలు తుడుచుకుంటూ అడిగాడు చంద్రకాంత్. రికార్డింగ్ పరికరాలతో పాటు ఎయిర్ కండిషన్ కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తోంది.

"భయపడనక్కరలేదులెండి. ఈ యూనిట్‌బాగానే ఉన్నట్లుంది" అందామె.

"వీటిల్లో మరి ఇంతవరకూ జరిగిన రికార్డింగ్‌లు ఎలా జరిగాయండీ?" అనుమానంగా అడిగాడు.

"అవన్నీ కాంగ్రెస్- 'బి' గవర్నమెంట్‌కి జై కొట్టే చెంచా ప్రోగ్రాములు కదండీ! రికార్డింగ్ క్వాలిటీ ఎలా ఉన్నా ఫర్వాలేదు. ఎందుకంటే వినేవారెవరూ ఉండరు. మరి మీ ప్రోగ్రాం అలా కాదు గదా- సినిమా పాటల కోసం మీ మాటలు వినక తప్పదు. విన్నప్పుడు మరి క్వాలిటీ లేకపోతే శ్రోణలు గొడవ చేస్తారు. అందుకే ఈ తిప్పలు"

అందామె.

రికార్డింగ్ ప్రారంభమయింది.

"ఆ, ఇది బాగానే ఉందండీ ఇక ప్రారంభిద్దాం. మీరు మాట్లాడాక సినిమా పాట రావాల్సిన చోట కొంచెం గాప్ ఇవ్వండి. తరువాత ఆ ప్లేస్‌లో పాట డబ్ చేస్తారు" అందామె.

ఎలాగయితేనేం, రికార్డింగ్ పూర్తయింది. అప్పటిచే చంద్రకాంత్ రూమ్ వేడికి తడిసి ముద్దయిపోయాడు.

అతను ఈసురోమని లంఖణాలు చేసినవాడిలా బయటికొచ్చి "బ్రతుకు జీవుడా" అని ఇంటికి బయలుదేరాడు.

"ఆకాశవాణి వివిధ భారతి- వాణిజ్య ప్రసార విభాగం! ఈనాటి ప్రత్యేక జనరంజని కార్యక్రమం- ప్రముఖ రచయిత శ్రీ చంద్రకాంత్ గారు సమర్పిస్తున్నారు" అంది రేడియోలో ఎనౌన్సరు.

చందకాంత్‌తో పాటు మేమందరం ప్రతిభాదేవి ఇంట్లో సమావేశమయాం, అతని కార్యక్రమం విని ఆనందించడానికి. ప్రతిభాదేవి ఆ కార్యక్రమాన్ని మరో టూ- ఇన్- వన్‌లో రికార్డింగ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

మరుక్షణం చంద్రకాంత్ గొంతు నీరసంగా వినబడింది.

శ్రోతలకు నమస్కారం! మీతో గడిపే ఈ అవకాశం దొరకడం నిజంగా నాకెంతో ఆనందంగా వుంది. ఎందుకంటే... టంగ్‌టంగ్.. లక్షాధికారులు కూడా- రెండో బిడ్డను కన్నప్పుడు అలోచనలో పడుతున్నారు...

"మనకూ మాణిక్యాల్లా ముచ్చటగా ముగ్గురున్నారుగా?"

"మన బిడ్డలు మాణిక్యాలే- మట్టిలో మాణిక్యాలు! ఒకడేమో కాళ్ళకు చెప్పులేనా లేకుండా గోళీకాయలాడుతున్నాడు."

"వాడికి చెప్పులు కొంటాన్లేవే."

"రెండోవాడు ఎక్కడెక్కడో తిరిగి ఇప్పుడే ఇంటికి వచ్చాడు."

"వీడికి గోళీకాయలు కొంటానులే."

"ఇక మూడోవాడు ఎండిపోయిన నా శరీరంనుంచి రక్తమాంసాలు పీల్చేస్తున్నాడు."

"అయితే వీడిని ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించి- అలానే నేనూ ఇప్పుడే ఆపరేషన్ కూడా చేయించుకొస్తా."

"టంగ్ - టంగ్-"

ప్రతిభాదేవి చిరాగ్గా అతనివేపు చూసింది.

"ఛఛ, ఈ పాడు గొడవంతా రికార్డయిపోయింది. అయినా మాటల మధ్యలో

ఎందుకు ఇరికించనిచ్చావు?"

"బాగుంది నాకేం తెలుసు? అసలు గాప్ కూడా వదల్లేదు నేను–" ఠక్కున మళ్ళా చంద్రకాంత్ గొంతు వినిపించేసరికి అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"–డ్రుప్‌జుక్‌ల ద్వారా మీతో మాట్లాడడం సాధ్యంకాదు. కాబట్టి సినిమా పాటలంటే నాకూ ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచీ నేను ప్రేమించేపాట ఒకటుంది. ఆ పాటలో అర్థం ఎంతో అద్భుతంగా ఉంటుంది. అందం అంటే ఆనందమనీ, ఆనందం అంటే జీవిత మకరందం– అనీ– టాంగ్– టాంగ్–

"కాళ్ళున్న కుర్రోళ్ళారా కాలేజి పిచ్చోళ్ళారా
క్రోకోడిల్ చెప్పులున్నాయ్! కాళ్ళకు క్రోకోడిల్ చెప్పుదున్నాయ్
మన్నికధికం– ధరలు స్వల్పం
క్రోకోడిల్ చెప్పులున్నాయ్– కాళ్ళకు క్రోకోడిల్ చెప్పులున్నాయ్

"ఈ పాటేశావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు అతని స్నేహితుడు.

"ఇది పాట కాదురా, వ్యాపార ప్రకటన" విసుగ్గా అన్నాడు చంద్రకాంత్.

"హోప్‌లెస్– ఈ వెధవ ప్రకటన కొంచెం రికార్డయింది" అంది ప్రతిభాదేవి రెండు చేతులలో తలపట్టుకుంటూ– మరి రెండు ప్రకటనల తర్వాత పాట మొదలయింది.

"ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరీ–హరీ–హరీ– కోకెత్తుకెళ్ళింది కొండగాలీ–"

అందరూ ఉలిక్కిపడ్డారు. వాళ్ళతోపాటు చంద్రకాంత్ కూడా షాకయ్యాడు.

"ఇదేమిట్రా అందమే ఆనందం పాట అని చెప్పి కొండగాలి కోకెత్తుకెళ్ళిందంటా వేమిటి?" వెంకట్రావ్ కోపంగా అన్నాడు.

"అదే నాకూ తెలీటంలే, నేను అందమె ఆనందం పాట వేయాలనే రాసిచ్చాను మరి వాళ్ళు ఇదెందుకు వేశారో" పాలిపోయిన మొఖంతో అన్నాడు చంద్రకాంత్.

ప్రతిభాదేవి టేప్ చేయడం ఆపేసింది. ఆమె మంచి సాహిత్యాన్ని ప్రేమిస్తుందన్న సంగతి అందరికీ తెలిసిందే!

"ఈ వెధవ పాట కూడ కొంచెం రికార్డయిపోయింది" అంది ఉక్రోషంగా.

"అసలు నువ్వే ఈ పాట రాసిచ్చావేమో" అంది అతనివేపు అనుమానంగా చూస్తూ.

అతనికి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి.

తనను "బాస్టర్డ్" అని తిట్టినా సహించగలడు గానీ ఇలాంటి పాటను తనే సజెస్ట్ చేశాడనడం మాత్రం సహించలేడు. వెంటనే అక్కడున్న ఫోన్ తీసుకుని వివిధ భారతికి డయల్ చేశాడు.

ఎవరిదో మగ గొంతు వినిపించింది.

తన గురించి చెప్పుకున్నాక నేను "అందమే ఆనందం పాటరాస్తే, మీరు కోకెత్తుకెళ్ళింది

కొండగాలి వేశారేమిటి?" అనడిగాడు.

"అదా! ఆ రికార్డ్ దొరకలేదేమో! అందుకని ఇది వేసి ఉంటారు!" అన్నాడతను తేలికగా.

"ఎవరు?"

"డబ్బింగ్ చేసినవాళ్ళు?"

ఎవరా డబ్బింగ్ చేసిన వ్యక్తి?"

"అదెలా తెలుస్తుందండీ! ఎవరుబడితే వాళ్ళే చేస్తుంటారు."

"ఆ పాట లేనప్పుడు ఊరుకోవాలి గానీ ఈ చెత్తపాట ఎందుకు పేసినట్లు?" కోపంగా అడిగాడు.

"బహుశా ఈ పాట ఆ డబ్బింగ్ చేసినతనికి ఇష్టమైనది అయుంటుంది! అయినా ఈ పాట మంచిదేగా! చాలా హిట్టయినా సాంగ్" అనేసి ఫోన్ పెట్టేశాడతను.

"ఏమన్నారు?" అడిగింది ప్రతిభాదేవి.

"ఏ పాటవేయాలి అనేది పాటలు డబ్ చేసేవాళ్ళ ఇష్టం మీద ఆధారపడి ఉంటుందట" నీరసంగా అన్నాడు చంద్రకాంత్.

'ఆరేసుకోబోయి' పాట అయిపోయింది.

వెంటనే అరడజను వ్యాపార ప్రకటనలు దుమ్ము దులిపేశాయ్.

ఆ తరువాత హఠాత్తుగా తుమ్ము వచ్చినట్లు చంద్రకాంత్ గొంతు వినబడింది.

"ఛీ... చెం మత్తు కలిగించే సాహిత్యం కనిపించేది. ఆ మత్తు కేవలం సాహిత్యానికే కాదు. ఆ పాట బాణీది కూడా! అప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోయే పాట ఇది- కబస్సా- తపట," టేప్ పూర్తిగా అరిగిపోయి ఏవేవో శబ్దాలు చేసిన తరువాత మళ్ళీ చంద్రకాంత్ గొంతు వినిపించింది.

"ఇప్పుడు- నాకిష్టమయిన పాట- మా ఫ్రెండ్ ప్రతిభాదేవి కూడా ఎప్పుడూ మెచ్చుకునే పాట- చిగురాకులలో చిలకమ్మా పాట" అన్నాడు చంద్రకాంత్.

అతను ప్రతిభాదేవి వంక గర్వంగా చూశాడు.

ఆమె వెంటనే టేప్ చేయసాగింది. మళ్ళీ చంద్రకాంత్ గొంతు-

"ఈ పాట గురించి చాలా బాగా చెప్పావు!" అన్నాడు గోపాల్రావ్.

ఇంకా చాలా చెప్పాను గాని అదంతా ఎందుకనో కట్ చేశారు" అన్నాడు చంద్రకాంత్.

అందరూ నిశ్శబ్దంగా పాట కోసం ఎదురు చూడసాగారు. అర నిముషం గడిచిపోయినా పాట వినిపించడం లేదు.

"ఏమయింది?" అంది ప్రతిభాదేవి ఆశ్చర్యంగా.

"నాకూ అదే అర్థం కవటం లేదు" అన్నాడు చంద్రకాంత్.

అందరూ మరో అరనిముషం ఎదుర్చూశారు. ఏవేవో శబ్దాలు వినపడుతున్నాయ్. కానీ పాట అంతులేదు.

"ఒకవేళ రేడియో స్టేషన్‌లో కరెంటుపోయిందేమో!" అన్నాడు జనార్ధన్.

చంద్రకాంత్ మళ్ళీ వివిధభారతికి ఫోన్ చేశాడు.

"హలో, నేను చంద్రకాంత్‌ని మాట్లాడుతున్నానండీ."

"చంద్రకాంత్ రెండు మీటపాన్లు తెప్పని చెప్పి అరగంటయింది. ఏమైపోయావ్" అడిగిందో లేడీ వాయిస్.

చంద్రకాంత్‌కి మండిపోయింది.

"మీటాపాన్ ఏంటండీ! నేను చంద్రకాంత్ రచయితను మాట్లాడుతున్నా!"

"తెలుసండీ. ఇవాళ జనరంజని మీరే సమర్పిస్తున్నారని ముందే ఎనౌన్స్ చేశాంగా."

"నేననేది రేడియోలో సంగతి కాదండీ ఇప్పుడు ఫోన్‌లో–"

"మాట్లాడండి."

"ఏదీ రేడియోలో పాట వినబడదేం?"

"వినబడలేదా?"

"లేదండీ సైలెంట్‌గా ఉంది రేడియో. ఒకవేళ మీ దగ్గర కరెంటేమయినా పోయిందేమోనని–"

మా దగ్గర వినబడుతోంది కదా! ఓ అర్థమయ్యింది మీ రేడియో వ్యాల్యూమ్ ఫుల్ పెట్టి, మీ చెవి స్పీకర్ దగ్గర ఆనించండి! బ్రహ్మాండంగా వినబడుతుంది.

"అదేమండి, చెవి రేడియో స్పీకరు వద్ద ఎందుకు పెట్టటం?"

"రికార్డింగ్ సరిగ్గా జరగలేదండీ. అందుకని అలా చేస్తే గానీ పాట వినబడదు"

"రికార్డింగ్ సరిగ్గా ఎందుకు జరగలేదు?"

"ఆ విషయం డబ్బింగ్ చేసినవారిని అడగాలండి!"

"ఎవరు డబ్ చేసింది?"

"ఒకరనేమిటండీ ఎవరుపడితే వళ్ళే చేస్తారు. ఎవరూ లేకపోతే మా నైట్ వాచ్‌మెన్ కూడా చేసేస్తాడు."

"ఎంత నైట్ వాచ్‌మన్ చేసినా సౌండ్ బాగా పెంచి రికార్డింగ్ చేయవచ్చు కదండీ?"

"మీకో రహస్యం చెప్పమంటారా?"

"చెప్పండి."

"మళ్ళీ ఎవరితోనూ అనరు కదా?"

"అనునులెండి."

"అసలు డిఫెక్ట్ ఆ రికార్డింగ్ హెడ్‌దండీ."

"రికార్డింగ్ హెడ్డంటే?"

"రికార్డ్ చేసే పరికరం అన్న మాట! అది కొంచెం చెడింది. ఇలా డబ్బింగ్ చేసేప్పుడు సాధారణంగా నేనేం చేస్తుంటానంటే దానిని ఓ చేత్తో గట్టిగా నొక్కి పట్టుకుని కూర్చుంటాను. అప్పుడు మాంచి సౌండ్ వస్తుంది. చాలామందికి ఈ విషయం తెలీదు. అంచేత తెలీనివాళు ్ళ డబ్బింగ్ చేసేప్పుడు ఆ హెడ్ 'టచ్' అవకపోవడం వల్ల పాట నూతిలోంచి వస్తున్నట్లుంటుంది."

"అది రిపేర్ చెయ్యొచ్చు కదండీ?"

"ఎందుకు చేయకూడదు? మహారాజులాగా చెయ్యవచ్చు."

"మరెందుకు చేయరు?"

"అదేనండీ, నేనూ ఎప్పుడూ తల్చుకుని తెగ ఆశ్చర్యపోతూంటాను."

చంద్రకాంత్ ఫోన్ పెట్టేసి విషయమంతా ప్రతిభాదేవికి చెప్పాడు. ఆమె వెంటనే ట్రాన్సిస్టర్ వాల్యూమ్ పూర్తిగా పెంచి చెవి స్పీకర్ దగ్గర ఉంచి వినసాగింది. ఓ క్షణం విన్నదో లేదో చటుక్కున తల దూరంగా జరిపి "ఛీ మీ టేస్టు ఇంత హారిబుల్ అనుకోలేదు" అంది చంద్రకాంత్‌తో కోపంగా.

"ఏమయింది?" బెదురుగా అడిగాడతను.

"నిజంగా మీకు తెలీదా?"

"ప్రామిస్- తెలీదు ఏ పాట వేశాను?"

"మీరే వినండి."

చంద్రకాంత్ తన చెవి స్పీకర్ కి ఆనించాడు.

ఎక్కడో నూతిలోంచి వినబడుతున్నట్లుంది పాట.

"రాయబారం చేయవే తడికో తడికా-"

"ఇదేమిటి? ఈ పాట ఇక్కడ వేయాల్సింది కాదు' కోపంగా అన్నాడు చంద్రకాంత్.

"మరెక్కడ వేయాలట?" లక్ష్మణరావు నవ్వుతూ అడిగాడు.

"నేను మరో సందర్భంలో సినిమా సాహిత్యం ఎంత చెడిపోయిందో ఉదాహరణగా దాని పల్లవి మాత్రం వేయమని కోరాను"

మళ్ళీ వివిధభారతికి ఫోన్ చేశాడతను.

"ఇదేమిటి! ఇక్కడ నేను చెప్పినపాట వేయకుండా మరో సందర్భములో వేయాల్సిన పాట ఇక్కడ వేశారు?"

అతను నవ్వాడు.

"అది డబ్బింగ్ చేసినతనిని అడగాలండీ."

"ఎవరు డబ్బింగ్ చేసింది- వద్దులెండి! అది టాప్ సీక్రెట్ కదా? అదీగాక అతని

ఇంట్రెస్టు అతనిది– కాదనటానికి మనమెవరం?" అనేసిఫోన్ పెట్టేశాడు.

పాట ఆగిపోగానే ట్రాన్సిస్టర్‌కి ప్రాణం వచ్చినట్లు ఇల్లెగిరిపోయే సౌండ్‌తో మోగసాగింది.

"టింగ్ – టింగ్"

"ఒరు పాకెట్ మంజీరా చేగోడీ కుడప్పా!"

"గివ్‌మీ వన్ పాకెట్ మంజీరా చేగోడీ బ్రదర్"

"ఏక్ పాకెట్ మంజీరా చేగోడీ దేదోభాయ్!"

"ఏమిటి? మంజీరా చేగోడీకి ఇంత డిమాండా?"

"అవును, కోట్లాది ప్రజలు కక్కుర్తిగా తింటారు మంజీరా చేగోడీలు."

"టింగ్ టింగ్–"

"మీ బొచ్చు తెల్లబడిపోయిందా? చింతించకండి, జిగేటా వారి హేర్‌డైని వాడండి, నల్లగా నిగనిగలాడే బొచ్చుతో మీ అందాన్ని రక్షించుకోండి."

"టింగ్ టింగ్–"

ప్రతిభాదేవి కోపంగా ట్రాన్సిస్టర్ స్విచాఫ్ చేసింది.

''అయిదు నిమిషాల తర్వాత మళ్లీ ఆన్ చేసేసరికి చంద్రకాంత్ గొంతు కంచుమోగినట్లు వినబడుతోంది.

"నేను రచన చేసిన సినిమా 'కాకరపాలెం కుర్రోడు' సినిమా షూటింగ్ అవుతున్నప్పుడు ఓ తమాషా జరిగింది. నేనూ, డైరెక్టరుగారూ మా పిక్చర్ హీరోగారూ ఏదో విషయం మాట్లాడుకుంటున్నాం.

"నేను డైరెక్టర్ గారితో మాట్లాడుతూ ఇలా అన్నాను– టింగ్ టింగ్– హలో! మీ వళ్లు దురదగా ఉందా? గిర్మెక్స్ కంపెనీవారి బర్మెక్స్ వాడండి. దురదలూ, వాపులూ, ప్రేలుడూ, అన్నీ తగ్గిపోయి శరీరం నునుపుగా, అందంగా, పచ్చగా తయారవుతుంది. గుర్తుంచుకోండి బర్మెక్స్– బర్మెక్స్– బర్మెక్స్."

"టింగ్ టింగ్."

ప్రతిభాదేవి రెండు చేతుల్తోనూ తల పట్టుకూర్చుంది.

ఠక్కున మళ్లీ చంద్రకాంత్ గొంతు వినిపించసాగింది.

"వంకాయకూరంటే నిజంగా అంత గొప్పది– ఆ కూర చూసినప్పుడల్లా... ధబక్.. ధబక్.."

అందరూ అదిరిపడ్డారు. చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. సడెన్ పాట "లగ్గమెప్పుడురా మావా అంటే– మాఘమాసం వెళ్ళేదాకా మంచిరోజు లేదన్నాడు ఆగేదెట్టాగా– అందాకా ఏగేదెట్టాగా."

"కాకరపాలెం కుర్రోడు షూటింగ్ అవుతున్నప్పుడు జరిగిన తమాషాకీ, వంకాయకూరకీ, ఈ పాటకూ ఏమిటి సంబంధం?" కోపం అణచుకుంటూ అంది ప్రతిభాదేవి.

వెంకట్రావ్, లక్ష్మణరావ్ విరగబడి నవ్వారు.

"ఒకవేళ ఏ సంబంధమూ లేకపోవడమే జోకేమో."

పాట ఆగిపోగానే చంద్రకాంత్ గొంతు మళ్ళీ తరుముకొచ్చింది.

"మా ఊరి రైల్వేస్టేషన్‌లో ఆ బిచ్చగాడు రాత్రి పన్నెండు గంటలకు నిశ్శబ్దంలో ఎలుగెత్తి పాడేపాట వింటూంటే నాకిప్పటికీ కళ్ళ వెంట నీళ్ళు తిరుగుతుంటాయ్– ఇదగో ఆ పాట వినండి. మీ గుండెలు కూడా తప్పక బరువెక్కిపోతాయ్."

"టింగ్ టింగ్–"

విర్మా– వాషింగ్ పౌడర్ విర్మా

... బట్టలు తెల్లగా ఉతుకు మురికిని తెల్లగా జేయు

వాషంగ్ పౌడర్ విర్మా

వాషింగ్ పౌడర్ విర్మా"

"టింగ్– టింగ్"

"ఏం పాట నాయనా అంత గుండెలు బరువెక్కే పాట అన్నావు" అడిగాడు లక్ష్మణరావు.

"ఏటికేతంబట్టి వెయి పుట్లు పండించి– ఎన్నడూ మెతుకెరుగరన్నా"

"నిజంగా చాలా గొప్పపాటరా! గుండెల్ని పిండేస్తుందది" వప్పుకున్నాడు చంద్రం.

"ఈ ఒక్కపాట సరిగ్గా వేసినా చాలు వాళ్ళు..." అన్నాడు లక్ష్మణరావు.

కానీ పాట రాలేదు మళ్ళా చంద్రకాంత్ గొంతు వినిపించసాగింది.

"టైమయిపోతోందనుకుంటాను ఆఖర్లో కాకరపాలెం కుర్రోడు లోని ఓ పాట వినిపిస్తాను– ఈ పాట సినిమాలో లేదు. సెన్సార్ వాళ్ళు ముక్కలు ముక్కలు చేసేశారు ఆ పాటను వినండి."

"టింగ్– టింగ్"

"గర్భ నిరోధక మాత్రలు ఎలా వాడాలి?"

"ఋతుక్రమం అయిన మూడో రోజు నుంచి రాత్రి పడుకోబోయేముందు ఓ మాత్ర మింగాలి. ఒకవేళ ఒకరోజు మర్చిపోతే రెండోరోజు రెండు మింగాలి. అప్పుడూ మర్చిపోతే పాపాయిని అనాధశరణాలయానికి ఇచ్చివేయాలి."

"అవును నర్సు చెప్పింది."

"తనూ పాపాయిని అనాధ శరణాలయానికే ఇచ్చిందట. అయినా నిన్ను కూడా అడుగుదామనుకున్నాను."

"టింగ్– టింగ్"

ప్రతిభాదేవి ట్రాన్సిస్టర్ స్విచాఫ్ చేసి టేప్ రికార్డర్‌లోని టేప్ తీసి మేడ మీద నుంచి కింద మురికి గుంటలోకి విసిరిపారేసింది.

"గెటవుట్" అంది అందరినీ– కోపంగా చూస్తూ. ముగ్గురూ రోడ్డు మీద కోచ్చేశారు.

ఆ తరువాత వారం రోజుల వరకూ చంద్రకాంత్ ఆఫీసు కెళ్ళలేదు, గడ్డం పెంచుకుని పిచ్చివాడిలా ఇంట్లోనే గడుపుతున్నాడు.

ఆ రోజు శనివారం. వాళ్ళ తమ్ముడు గదిలోంచి రేడియో గట్టిగా వినబడుతోంది. "అందమె ఆనందం– ఆనందమె జీవిత మకరందం–"

"ఈ పాటలేదన్నారు. ఇప్పుడెలా వినబడుతోంది?" కోపంగా అనుకున్నాడతను మరుక్షణంలో శ్రోతల ఉత్తరాల కార్యక్రమం ప్రారంభమయింది.

రచయిత చంద్రకాంత్ గారు సమర్పించిన జనరంజనిని మా ఇంటిల్లీపాదీ ఎంతో తిట్టుకున్నాం. వాక్యానికీ వాక్యానికీ పొంతన లేకుండా, చెప్పే దానికీ పాటకూ సంబంధం లేకుండా, అర్థం లేని సగం వాక్యాలు చదివీ వెధవ్వాగుడు వాగి శ్రోతలకు పిచ్చి ఎక్కించటానికి ప్రయత్నించారాయన. ఇంకోసారి ఇలాంటి పిచ్చి జనరంజినీలు సమర్పించకండి. ఇలాంటి చిల్లర బూతుపాటలు వేసే రచయితల్ని పిలవకండి."

"వంగపల్లి నుంచి రామకృష్ణరావు గారు కూడా చంద్రకాంత్ గారిని బూతులు తిడుతూ ఉత్తరం రాస్తున్నారు. పాటలు పరమ చెత్తగా ఉన్నాయనీ, అలాంటి చెత్తపాటలు వేయడం వల్ల రచయిత గారి దరిద్రపు అభిరుచి తెలుసుకోడానికి వీలయిందనీ అంటున్నారాయన. అలాగే సికింద్రాబాద్ నుంచి రాజారామ్ గారు చంద్రకాంత్ గారిని దూషిస్తూ రాశారు. ఇంకా సనత్‌నగర్ నుంచి అప్పలాచారి గారు, మల్కాజ్‌గిరి నుంచి రమణారెడ్డి గారు, ఉప్పల్ నుంచి మనోహర్ గారు, రామ్‌నగర్ నుంచి ప్రతిభాదేవి గారు, మలక్‌పేట్ నుంచి చంద్రం, లక్ష్మన్‌రావ్ గార్లు...

చంద్రకాంత్ పరుగుతో వెళ్ళి టేబుల్ మీదున్న రేడియో ఎత్తి నేలకేసి కొట్టాడు. అతనికి పగిలిన ముక్కలు చూసేసరికి తెగ నవ్వొచ్చింది.

"హ్హాహ్హాహ్హా జనరంజని– హ్హాహ్హాహ్హాహ్హా ప్రత్యేక జనరంజని– హ్హాహ్హాహ్హాహ్హా".